ప్రజా
తెలంగాణ జాతీయ దినపత్రిక
ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు
ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 169 పేజిలు : 04 వెల రూ. 2 శుక్రవారం 19 - 12 - 2025



ఉపాధి హామీ చట్టం రద్దు.. 'వీబీ జీ రామ్ జీ' బిల్లుకు లోక్‌సభ ఆమోదం

## మా రెండేళ్ల పాలనపై
# తీర్పుగా భావిస్తున్నాం

- సీఎం రేవంత్
- గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై సీఎం మీడియా సమావేశం
- బీఆర్ఎస్, బీజేపీ ఒకేటేనన్న సీఎం
- 2029 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలన్న ముఖ్యమంత్రి రేవంత్
- ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లు అయిన తర్వాత జరిగిన ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌ను ఆదరించారని సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం
- గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు
- చాలా గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని, సహకరించుకున్నాయని ఆరోపించారు
- 62 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు
- ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించటం దారుణమని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు



ప్రభుత్వం ఏర్పడిన రెండేళ్లు అయిన తర్వాత జరిగిన ఎన్నికల్లో మళ్లీ కాంగ్రెస్‌ను ఆదరించారని సీఎం రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అద్భుతమైన ఫలితాలు సాధించిందన్నారు. హైదరాబాద్‌లో జరిగిన మీడియా సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి గ్రామ పంచాయతీ ఎన్నికల ఫలితాలపై మాట్లాడారు. విలేకరులు అడిగిన ప్రశ్నలకు ముఖ్యమంత్రి సమాధానమిచ్చారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్రంలో 12,702 పైగా గ్రామ పంచాయతీలకు ఎన్నికలు పూర్తి అయ్యాయని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగాయని చెప్పారు. ఎన్నికలు సజావుగా నిర్వహించిన అధికారులకు అభినందనలు తెలిపారు. పార్టీ విజయం కోసం కష్టపడిన కాంగ్రెస్ కార్యకర్తలందరికీ - మిగతా 2 లో

### బీజేపీ కార్యాలయం ముట్టడికి
## కాంగ్రెస్ కార్యకర్తల యత్నం



- గాంధీభవన్ వద్ద ఉద్రిక్తత
- నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియా, రాహుల్‌ను ఈడీ కేసులతో వేధిస్తున్నారని కాంగ్రెస్ నేతల నిరసనలు
- బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ నేతల యత్నం
- నేషనల్ హెరాల్డ్ కేసులో గాంధీ కుటుంబాన్ని ఈడీ కేసులతో వేధిస్తున్నారని ఆరోపణ
- గాంధీ భవన్ నుంచి బీజేపీ కార్యాలయం వరకు కవాతుకు ప్రయత్నం
- కాంగ్రెస్ ర్యాలీని అడ్డుకున్న పోలీసులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను ఈడీ కేసులతో వేధిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ కాంగ్రెస్ శ్రేణులు హైదరాబాదులో గాంధీ భవన్ నుంచి బీజేపీ రాష్ట్ర కార్యాలయం దిశగా కవాతు చేయడానికి ప్రయత్నించడంతో ఉద్రిక్తత నెలకొంది. ఏఐసీసీ రాష్ట్ర ఇంఛార్జ్ మీనాక్షి నటరాజన్, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌తో పాటు - మిగతా 2 లో

## నాంపల్లి కోర్టుకు హాజరైన మంత్రి సీతక్క



- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు
- కరోనాను ఆరోగ్యశ్రీలో చేర్చాలని 2021లో ధర్నా
- సీతక్కతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా హాజరు
- లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉండగా ధర్నా నిర్వహించి, కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారని ఆరోపిస్తూ కేసు నమోదు

తెలంగాణ మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఈరోజు నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టుకు హాజరయ్యారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నమోదైన కేసు విచారణలో భాగంగా ఆమెతో పాటు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కూడా కోర్టు ఎదుట హాజరయ్యారు.2021లో కరోనా మహమ్మారి తీవ్రంగా ఉన్న సమయంలో, కోవిడ్ చికిత్సను ఆరోగ్యశ్రీ పథకంలో - మిగతా 2 లో

# భారత్ బాగానే దెబ్బతీసింది

- భవనం మొత్తానికి టార్పాలిన్ కప్పుకున్న పాకిస్థాన్
- ఆపరేషన్ సిందూర్ లో భాగంగా పాక్ గడ్డపై ఐఏఎఫ్ భీకర దాడులు
- ఐఏఎఫ్ దాడి చేసిన మురిద్ ఎయిర్‌బేస్‌లో భారీ మరమ్మతులు
- శాటిలైట్ చిత్రాల్లో బయటపడిన పునర్నిర్మాణ పనులు
- భవనాన్ని కప్పివేస్తూ భారీ రెడ్ టార్పాలిన్ ఏర్పాటు
- మే 10న 'ఆపరేషన్ సిందూర్'లో ధ్వంసమైన కమాండ్ సెంటర్
- అంతర్గత నష్టం తీవ్రంగా జరిగినట్లు నిపుణుల అంచనా



'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా భారత వాయుసేన దాడి చేసిన పాకిస్థాన్‌లోని కీలకమైన ఎయిర్‌బేస్‌లో భారీగా పునర్నిర్మాణ పనులు జరుగుతున్నట్లు వెల్లడైంది. మురిద్ ఎయిర్‌బేస్‌లోని కీలక కమాండ్ అండ్ కంట్రోల్ భవనంపై జరిపిన దాడిలో దెబ్బతిన్న ప్రాంతాన్ని కప్పిపుచ్చేందుకు పాకిస్థాన్ ఇప్పుడు ఓ భారీ రెడ్ టార్పాలిన్‌ను ఏర్పాటు చేసింది. ఈ విషయాన్ని ఎన్డీటీవీకి లభించిన హై-రిజల్యూషన్ శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి.డిసెంబర్ 16న తీసిన ఈ శాటిలైట్ చిత్రాల్లో... పాకిస్థాన్ అన్‌మ్యాన్డ్ ఏరియల్ వెహికల్స్ ఆపరేట్ చేసే కాంప్లెక్స్ పక్కనే ఉన్న ఈ భవనాన్ని పూర్తిగా ఎర్ర టార్పాలిన్‌తో కప్పేసినట్లు కనిపిస్తోంది. గతంలో జూన్‌లో తీసిన చిత్రాల్లో కేవలం దెబ్బతిన్న - మిగతా 2 లో

## 2 గంటలకు బాంబు పేలుతుంది



2 లో

- నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు
- గుర్తు తెలియని వ్యక్తుల నుంచి బెదిరింపు మెసేజ్
- జడ్జిలు, కోర్టు సిబ్బంది, న్యాయవాదులను బయటకు పంపించి తనిఖీలు చేపట్టిన పోలీసులు
- బెదిరింపుకు పాల్పడిన వ్యక్తులను గుర్తించేందుకు సైబర్ పోలీసుల యత్నం

### ప్రధాని మోదీకి ఒమన్
## అత్యున్నత పురస్కారం



- 29వ అంతర్జాతీయ గౌరవం
- 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను ప్రదానం చేసిన సుల్తాన్
- రెండు రోజుల క్రితం ఇథియోపియా నుంచి కూడా అత్యున్నత గౌరవం
- భారత్-ఒమన్ మధ్య కీలక సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం
- ఇరు దేశాల 70 ఏళ్ల దౌత్య సంబంధాలకు గుర్తుగా ఈ పర్యటన

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన ఖాతాలో మరో అరుదైన అంతర్జాతీయ గౌరవాన్ని చేర్చుకున్నారు. ఒమన్ పర్యటనలో ఉన్న ఆయనకు ఆ దేశ అత్యున్నత పురస్కారమైన 'ది ఫస్ట్ క్లాస్ ఆఫ్ ది ఆర్డర్ ఆఫ్ ఒమన్'ను సుల్తాన్ హైథమ్ బిన్ తారిక్ గురువారం ప్రదానం చేశారు. గతంలో క్వీన్ ఎలిజబెత్, - మిగతా 2 లో

## ఆ జిల్లాల్లో నేరాలు ఎందుకు పెరిగాయి?



2 లో

- పోలీసింగ్ అంటే భయం ఉండాలి!
- సీఎం చంద్రబాబు
- కొన్ని జిల్లాల్లో నేరాలు పెరగడంపై చంద్రబాబు అసంతృప్తి
- శాంతిభద్రతలే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యమని స్పష్టీకరణ
- రాష్ట్రవ్యాప్తంగా 5.5 శాతం నేరాలు తగ్గాయన్న డీజీపీ
- అన్నమయ్య, నెల్లూరు, గుంటూరు జిల్లాల్లో క్రైమ్ రేట్ పై విశ్లేషణకు ఆదేశం

### ఉత్తమ విధానాలు
# దేశానికే ఆదర్శం

- మంచి ఫీడ్ బ్యాక్‌తో మరింత ఉత్సాహం: సీఎం చంద్రబాబు
- అమరావతిలో రెండో రోజు కలెక్టర్ల సదస్సు
- వివిధ అంశాలపై వచ్చిన ఫీడ్ బ్యాక్‌ను కలెక్టర్ల సదస్సులో పంచుకున్న సీఎం చంద్రబాబు
- విద్యాశాఖ రూపొందించిన ముస్తాబు వంటి ఉత్తమ విధానాలను అన్ని జిల్లాల కలెక్టర్‌లు అనుసరించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం
- భూ రికార్డులు స్టోరేజ్ లేదా క్లౌడ్‌లో ఉంచటం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చన్నారు
- 6 జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన విధానాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలన్నారు
- రొటీన్‌గా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌లో చర్చ



విద్యాశాఖ రూపొందించిన ముస్తాబు వంటి ఉత్తమ విధానాలను అన్ని జిల్లాల కలెక్టర్‌లు అనుసరించాలని సీఎం చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. అన్ని భూ రికార్డులు స్టోరేజ్ లేదా క్లౌడ్‌లో ఉంచటం ద్వారా అక్రమాలు అరికట్టవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఖర్చుపెట్టే ప్రతిపైసాకు చక్కని ఫలితం ఉండాలని పాలనాయంత్రాంగానికి సూచించారు. రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కలెక్టర్లు అమలు చేస్తున్న కొన్ని విధానాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రశంసించారు.సచివాలయంలో జరుగుతున్న కలెక్టర్ల సదస్సు 2వ రోజూ సీఎం చంద్రబాబు నూతన ఒరవడికి శ్రీకారం చుట్టారు. వివిధ జిల్లాల్లో అమలు చేస్తున్న ఉత్తమ - మిగతా 2 లో



# సంపాదకీయం

## గెలుపు సరే ఓటమిని ఒప్పుకోవటం ఎలా

సర్కారు కొలువుల వేటలో ఓటమిని ఒప్పుకోలేక, తమకు రాని ఉద్యోగాలు వచ్చినట్టు చెప్పుకున్న మూడు సంఘటనలు ఇటీవల తెలంగాణలో జరిగాయి. మెదక్ ప్రాంతానికి చెందిన ఒక అభ్యర్థి ఇటీవలి గ్రూప్%-%1 జాబితాలో డీఎస్పీ ఉద్యోగం పొందినట్టు ప్రచారం చేసుకున్నాడు. మరొక అభ్యర్థి తాను యూపీఎస్సీ పరీక్షలో ఎంపిక అయ్యానంటూ ఒక కలెక్టర్ కార్యాలయానికి వెళ్ళి హల్‌చల్ చేశాడు. సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీస్ కానిస్టేబుల్ ఉదంతం ఒకటి ఇటువంటిదే బైటపడింది. ఈ ముగ్గురూ బాగా చదువుకుని పోటీ పరీక్షలకు తయారైనవారే. విజయం సాధించలేకపోవడంతో ఇలా అసాధారణంగా ప్రవర్తించారు. పరాజయానికి కుంగిపోయి తనువు చాలించేవారి గురించి మనం విని ఉన్నాం. అయితే ఈ మూడు సంఘటనల్లో ఓటమిని స్వీకరించలేని మానసిక అవస్థ కనపడుతున్నది. ఓటమిని ఒప్పుకుని, దాని నుండి నేర్చుకోవలిసింది నేర్చుకుని ముందుకు సాగే ఒడుపును ఇప్పటి తరాలు కోల్పోతున్నారేమో అనిపిస్తోంది. ప్రభుత్వ ఉద్యోగం సంపాదించాలని పోటీ పరీక్షలకు కూర్చునే యువత, దాన్ని సాధించలేనప్పుడు, ఆ ఉద్యోగ సాధనా ప్రక్రియలోనే నేర్చుకున్న పాఠాలను తమ జీవితాలలో ముందుకు సాగేందుకు ఎట్లా వాడుకోవాలి అనే దిశగా ఆలోచన చేయాలి. వారికి సూచనలు, సలహాలు ఇచ్చేవారు ఈ తరహా ఆలోచనను వారిలో పెంచాలి. మన దేశంలో సర్కారు ఉద్యోగం కోసం పోటీ తీవ్రంగా పెరిగిపోయింది. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్య కూడా తగ్గిపోవడం మొదలైంది. పోటీ తీవ్రత వల్ల విజయం సాధించే అవకాశాలు 2శాతం కంటే తక్కువ మంది అభ్యర్థులకు మాత్రమే ఉంటాయి. యూనియన్ సివిల్ సర్వీసులలో ఈ విజయ శాతం 0.17 మాత్రమే. పోటీ పరీక్షల అభ్యర్థులు ఈ వాస్తవాన్ని మరిచిపోతేనే వారి ప్రవర్తనలో ఇలాంటి సమస్యలు తలెత్తుతాయి. నేటి వ్యాపార సంస్కృతిలో విజయాన్ని కీర్తించడం, విజయం సాధించడాన్ని ఆకాశానికి ఎత్తేయడం బాగా పెరిగిపోతోంది. గెలుపు కథలకే డిమాండ్ ఉన్న ఈ సంస్కృతిలో అపజయాన్ని ఎదుర్కొనే కళ మరుగునపడిపోతున్నది. 'గెలుపు సరే బతకడం ఎలా' పేరుతో కె.ఎన్.వై. పతంజలి రాసిన పుస్తకం ఇప్పుడు ఎవరికీ గుర్తులేదు. జీవితంలో అనేక ఆశాభంగాలు ఉంటాయి. కానీ నేటి న్యూక్లియర్ కుటుంబాల్లోని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ ఆశాభంగాలకు సరిగా సిద్ధం చేయటం లేదు. అపజయం అన్నది ఇప్పుడు పూర్తిగా దాచిపెట్టాల్సిన, లోగొంతుకలో మాత్రమే మాట్లాడాల్సిన విషయం అయిపోయింది. కానీ పిల్లలు అపజయాలకు సిద్ధం కావాలంటే తల్లిదండ్రులు వారితో తమ జీవితంలోని అపజయాలను పంచుకోవాలి. అప్పుడే ఏ ఓటమీ శాశ్వతం కాదన్న నమ్మకం పిల్లలలో కలుగుతుంది. 1970ల వరకు మన గ్రామీణ, నగర ప్రాంతాల్లో పిల్లలను కుటుంబాలతోపాటు, చుట్టూ వీధులూ, సమాజం కూడా పెంచేవి. 1990ల తరువాత పెరిగిన మార్కెట్ భావజాలం మధ్య కుటుంబం మాత్రమే పిల్లలకు అన్నీ సమకూర్చే యూనిట్‌గా మారిపోయింది. అయితే ఆ కుటుంబానికి ఉండే మానసిక, సామాజిక వైశాల్యం చాలా పరిమితం కావటం వల్ల 'అపజయం వల్ల తిరస్కారం', 'ఏదో ఒక తీరులో విజయం సాధిస్తే చాలు అదే పురస్కారం' అన్నదే ముఖ్యమైన విలువగా యువత మనో ప్రపంచాన్ని నింపివేస్తున్నాయి. దీనితో ఓటమిని ఒప్పుకోగలిగే మానసిక బలం వారికి లేకుండా పోతున్నది. మనిషి పెట్టుకునే లక్ష్యం ఆ మనిషి కోరిక మాత్రమే. కోరుకున్న ప్రతిసారీ కోరిక తీరవలిసిందే అనే ఆలోచనా ధోరణి ప్రకృతి నియమానికే విరుద్ధం. కోరుకున్న లక్ష్యం సాధించేందుకు చేసే ప్రయత్నంలో ఓడిపోతే, ఆ లక్ష్యం కోసం పయనంలో నేర్చుకున్న మంచి గుణాలను, అలవాట్లను తమ నిత్యజీవితంలో ఉంచుకోవాలి. లక్ష్యం కంటే, వీటికి విలువ ఎక్కువ. ఏ ఓటమీ శాశ్వతం కాదు. అనుకున్న కోరిక నెరవేరకపోవడం అసహజమేమీ కాదు. సాధించలేని లక్ష్యాన్ని వదిలివేసి, మరో లక్ష్యం వైపు ప్రయత్నాన్ని ఎక్కుపెట్టడమే జీవితం. ఏ మనిషి గతమైనా, మొత్తం మానవ సమూహగతమైనా అనేక ఓటములూ, కొన్ని మాత్రమే గెలుపుల సంపుటి. పరాజయాలన్నీ పతనం దిక్కుకే నడిపేవి అయివుంటే మానవ నాగరికత వికసించేదే కాదు. సర్కారు కొలువుల లక్ష్యాన్ని నిర్దేశించుకుని పోటీ పరీక్షలలో నిలబడే యువత ఈ అవగాహనను పెంచుకోవాలి. లేకపోతే మానసిక వికృతులు పెరిగి సామాజిక, వ్యక్తిగత విధ్వంసాలు జరుగుతాయి.

## నాంపల్లి కోర్టుకు హాజరైన మంత్రి సీతక్క



**మొదటిపేజీ తరువాయి** - చేర్చాలని డిమాండ్ చేస్తూ సీతక్క, అప్పటి ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద నిరాహార దీక్ష చేపట్టారు. కరోనా రోగులకు ఉచిత అంబులెన్స్ సేవలు అందించాలని, వ్యాధితో మరణించిన వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం చేయాలని వారు అప్పటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అయితే, లాక్‌డౌన్ నిబంధనలు అమల్లో ఉండగా ఇందిరాపార్క్ వద్ద ధర్నా నిర్వహించి, కరోనా వ్యాప్తికి కారణమవుతున్నారని ఆరోపిస్తూ అప్పటి కేసీఆర్ సర్కార్ సీతక్క, బల్మూరి వెంకట్‌పై కేసు నమోదు చేసింది. ఆ కేసుకు సంబంధించిన విచారణలో భాగంగానే ఇవాళ వారిద్దరూ న్యాయస్థానం ముందు హాజరయ్యారు.

## భారత్ బాగానే దెబ్బతీసింది



**మొదటిపేజీ తరువాయి** - భాగాన్ని మాత్రమే చిన్న గ్రీన్ టార్పాలిన్‌తో కప్పారు. కానీ ఇప్పుడు మొత్తం భవనానికే టార్పాలిన్ ఏర్పాటు చేయడం గమనార్హం. సాధారణంగా సైనిక స్థావరాల్లో మరమ్మతు పనులను, నష్టాన్ని శాటిలైట్ నిఘా నుంచి దాచిపెట్టేందుకు ఇలాంటి భారీ టార్పాలిన్‌లను ఉపయోగిస్తారు. ఈ ఏడాది మే 10వ తేదీన తెల్లవారుజామున భారత వైమానిక దళం జరిపిన దాడుల్లో ఈ భవనం పైకప్పు కూలిపోవడంతో పాటు, నిర్మాణానికి తీవ్ర నష్టం వాటిల్లింది. లోపల ఉన్న వ్యవస్థలు కూడా ధ్వంసమై ఉంటాయని అంచనా. పైకప్పును చీల్చుకుని లోపలికి వెళ్లి పేలే అత్యాధునిక క్షిపణులను ఐఏఎఫ్ ఈ దాడిలో ఉపయోగించి ఉండవచ్చని నిపుణులు భావిస్తున్నారు. శాటిలైట్ చిత్రాల నిపుణుడు డేమియన్ సైమన్ ప్రకారం, మొదట నష్టాన్ని అంచనా వేయడానికి చిన్న టార్పాలిన్ వాడి, ఇప్పుడు మొత్తం భవనాన్ని కప్పేయడం చూస్తుంటే అంతర్గత నష్టం ఊహించిన దానికంటే ఎక్కువగా జరిగి ఉండవచ్చని తెలుస్తోంది. మురిద్‌తో పాటు ముషాఫ్, రహీమ్ యార్ ఖాన్ వంటి ఇతర ఎయిర్‌బేస్‌లలో దెబ్బతిన్న రన్‌వేలకు కూడా పాకిస్థాన్ మరమ్మతులు పూర్తి చేసినట్లు సమాచారం.

## 2 గంటలకు బాంబు పేలుతుంది

**మొదటిపేజీ తరువాయి** - హైదరాబాద్ నగరంలోని నాంపల్లి సీబీఐ కోర్టుకు బాంబు బెదిరింపు ఈ-మెయిల్ వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటలకు కోర్టు ప్రాంగణంలో బాంబు పేలుతుందని ఆ సందేశంలో పేర్కొన్నారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు న్యాయమూర్తులు, కోర్టు సిబ్బంది, న్యాయవా దులను కోర్టు నుంచి బయటకు పంపించి, బాంబు నిర్వీర్య దళాలతో తనిఖీలు చేపట్టారు. కోర్టు లోపల, పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చిన ఈ బెదిరింపు సందేశంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కోర్టు ప్రాంగణంలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు. బెదిరింపులకు పాల్పడిన వారిని గుర్తించేందుకు సైబర్ క్రైమ్ పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

# ఉత్తమ విధానాలు దేశానికే ఆదర్శం

**మొదటిపేజీ తరువాయి** - విధానాలను ఆయా జిల్లాల కలెక్టర్లతోనే ప్రజెంటేషన్ ఇప్పించారు. 6 జిల్లాల కలెక్టర్లు ప్రదర్శించిన విధానాలు రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని ఆదేశించారు. రొటీన్‌గా కాకుండా ప్రజలకు ఉపయోగపడేలా కలెక్టర్ల కాన్ఫరెన్సులో చర్చ జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. వివిధ అంశాలపై అల్లూరి, పార్వతీపురం మన్యం, ఏలూరు, నెల్లూరు, కడప, అనంతపురం జిల్లాల కలెక్టర్లు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. జిల్లాల్లో అత్యుత్తమ విధానాల ద్వారా సేవలందిస్తున్న కలెక్టర్లను సీఎం అభినందించారు. వచ్చే కలెక్టర్ల సమావేశం నాటికి ప్రజలకు ఉపయోగపడే మరిన్ని వినూత్న ఆలోచనలు, కార్యక్రమాలతో రావాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ద్వారా వినూత్న ఆలోచనలతో ప్రజలకు ప్రయోజనం కలిగించాలని దిశానిర్దేశం చేశారు. విద్యాశాఖలో ఈ మార్పు జరగాలని ఆకాంక్షించారు. కలెక్టర్లు మరింత మెరుగైన మోడళ్లతో కొత్త విధానాలు అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ముస్తాబు కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని స్కూళ్లకు స్మార్ట్ కిచెన్ల ద్వారా ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. స్మార్ట్ కిచెన్ల నిర్మాణం కోసం భూములను పరిశీలించాలన్నారు. కడపలోని స్మార్ట్ కిచెన్ విధానాన్ని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్?కు చూపించామని ఆయనకు ఈ విధానం నచ్చిందని అన్నారు. కడప జిల్లాలో చేపట్టిన స్మార్ట్ కిచెన్ ఫర్ ఆల్ ద స్కూల్స్ ప్రాజెక్టును జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ వివరించారు. స్మార్ట్ కిచెన్ స్మార్ట్ హెల్త్ స్మార్ట్ చిల్డ్రన్ అన్నట్టుగా ఈ విధానాన్ని తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు కడప స్మార్ట్ కిచెన్లను సందర్శించాలని కోరారు. స్మార్ట్ కిచెన్‌కు సర్టిఫికేషన్ కూడా తీసుకోవటం అభినందనీయమని టీటీడీ తరహాలోనే తనిఖీ వ్యవస్థ ఉండాలని తెలిపారు. రైతు బజార్లలోనూ నాచురల్ ఫార్మింగ్ ఉత్పత్తులు రావాలని, సర్టిఫికేషన్‌తో పాటు డోర్ డెలివరీ వచ్చేలా ఉండాలన్నారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా అంగన్ వాడీలు, సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలకూ ఆహారం అందించాలని సూచించారు. కడపలోని అన్ని స్కూళ్లల్లో చిన్నారులకు, విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పూర్తిస్థాయిలో ఈ బెస్ట్ ప్రాక్టీసెస్‌ను మరింతగా విస్తృతపరిస్తే ప్రజలకు ఉపయోగం కలుగుతుందని సీఎం అన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలోనూ వినూత్న మార్పు వచ్చిందని 22ఏ భూముల విషయంలో ఏలూరు, బాపట్ల తదితర ప్రాంతాల్లో చేసిన మోడల్?ను ఇతర ప్రాంతాల్లోనూ చేయాలని ఆదేశించారు. రెవెన్యూ రికార్డుల డిజిటైజేషన్‌లో ఏఐ వినియోగం ప్రాజెక్టుపై అనంతపురం కలెక్టర్ ఆనంద్ ప్రజెంటేషన్ ఇచ్చారు. రెవెన్యూ ఆఫీస్ టూల్ తయారు చేసి యూజర్లకు అనువుగా మార్చామని వివరించారు. నాటుసారా తయారీ గ్రామాల్లో మార్పు: అనంత జిల్లాలో గ్రామస్థాయిలో రెవెన్యూ రికార్డుల లైబ్రరీ సిద్ధంగా ఉందని వెల్లడించారు. వివిధ అంశాలపై తనకు వచ్చిన ఫీడ్ బ్యాక్?ను సీఎం కలెక్టర్ల కాన్ఫరెన్సులో పంచుకున్నారు. రిజిస్ట్రేషన్ల విధానం, నీటి భద్రత వంటి విషయాలు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నందుకు ఆనందంగా ఉందని తెలిపారు. 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసి తమను పంపించేశారని అదనంగా రూపాయి కూడా తీసుకోలేదని తనకు ఫోన్ వచ్చిందని సీఎం చెప్పారు. తిరుపతికి వెళ్తున్న మార్గంలో చెరువులన్నీ నీటి నిండిపోయాయని, తమకు చాలా సంతోషంగా ఉందని, ఎనర్జీ లెవల్స్ కూడా పెరిగాయన్నారు. ప్రాజెక్టు మార్పు అనే వినూత్న ఆలోచన ద్వారా 140 నాటుసారా తయారీ గ్రామాల్లో స్పష్టమైన మార్పు తీసుకురావడం పట్ల ఏలూరు జిల్లా కలెక్టర్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. కేవలం అరెస్టులు, కేసులతో వారి జీవితాల్లో మార్పు తీసుకురాలేమని ఇలాంటి కార్యక్రమాల ద్వారానే వారిలో మార్పు తీసుకురావచ్చని నిరూపించారన్నారు. ప్రాజెక్టు మార్పు కార్యక్రమాన్ని రాష్ట్రవ్యాప్తంగా అమలు చేయాలని సూచించారు. డ్రగ్స్ నియంత్రణపై కూడా దృష్టి పెట్టాలని దిశా నిర్దేశం చేశారు. డ్రగ్స్ తీసుకునే వ్యక్తులను కూడా మార్చేలా ఉపాధి కల్పించాలని సీఎం ఆదేశించారు. శాఖలన్నీ ఇంటిగ్రేట్ చేసి రైతులకు ప్రయోజనకరంగా మార్చవచ్చనేది నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా నిరూపించారని సీఎం అభినందించారు. సహాయక సంఘాలను ఏర్పాటు: మానవ వనరులు సద్వినియోగం చేసుకునేలా ఛాంపియన్ ఫార్మర్ అనే వినూత్న ప్రయోగం బాగుందని ప్రశంసించారు. అమరావతిలోనే ఉండమని హిమాన్షును కోరానని కానీ ఓ జిల్లాలో ఇంపాక్ట్ కలిగిస్తానని కలెక్టరుగా వెళ్లి చక్కగా పని చేస్తున్నారన్నారు. రైతు సేవా కేంద్రం, స్వర్ణాంధ్ర విజన్ యూనిట్ల ద్వారా రైతులకు ప్రయోజనం కల్పించే ఇలాంటి విధానాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు అవగాహన కల్పించాలని సూచించారు. చాంపియన్ ఫార్మర్ల ద్వారా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేయడమో లేదా ఎంఎస్ఎంఈలుగా తీర్చిదిద్దడమో చేయాలన్నారు. సీజనల్ పంటలతో పాటు హార్టికల్చర్ పంటలకు ఈ విధానాలను విస్తరించాలని రైతులకు వ్యయం తగ్గాలని అత్యధిక ఆదాయం అందాలని సీఎం అన్నారు. స్వర్ణాంధ్ర-2047 10 సూత్రాలపైనా కలెక్టర్ల సదస్సులో చర్చ జరిగింది. జీరో పావర్టీ, పాపులేషన్ మేనేజ్‌మెంట్, నైపుణ్యం-ఉపాధి కల్పన, నీటి భద్రత, అగ్రిటెక్, లాజిస్టిక్స్, ఇంధన నిర్వహణ, ప్రాడెక్టు పర్ఫెక్షన్, స్వచ్ఛాంధ్ర, డీప్ టెక్ అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. పీ4 ద్వారా జీరో పావర్టీ లక్ష్యాన్ని సాధించటంతో పాటు ఫ్యామిలీ బెనిఫిట్ మేనేజ్‌మెంట్ సిస్టం ద్వారా ఫ్యామిలీ కార్డు జారీ, ప్రజారోగ్యం తదితర అంశాలపై ప్రజెంటేషన్?లు ఇచ్చారు. రాష్ట్రంలో మాతాశిశు మరణాల రేటు తక్కువగా నమోదయ్యేలా కార్యాచరణ చేపట్టాలని సీఎం సూచించారు. ప్రజారోగ్యం కాపాడేలా పౌల్ట్రీ సహా ఇతర మాంసపు ఉత్పత్తుల్లో గ్రోత్ ప్రమోటర్లను నియంత్రించాలని ఆదేశించారు. రాష్ట్రంలో నీటి భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.

# 'స్మార్ట్ కిచెన్, స్మార్ట్ హెల్త్, స్మార్ట్ చిల్డ్రన్'

**మొదటిపేజీ తరువాయి** - పిల్లల ఆరోగ్యంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. పాఠశాల విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన ఆహారం అందించడమే లక్ష్యంగా ప్రణాళిక రచించింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో 'స్మార్ట్ కిచెన్'ల ద్వారా వేడివేడి భోజనం అందనుంది. కడప జిల్లాలో ప్రయోగాత్మకంగా అమలు చేసి విజయవంతమైన ఈ విధానాన్ని, ఇప్పుడు రాష్ట్రమంతటా విస్తరించనున్నారు. ఉండవల్లిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన రెండో రోజు కొనసాగుతున్న కలెక్టర్ల సదస్సులో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. విద్య, ఆరోగ్యంపై జరిగిన చర్చలో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రమంతా స్మార్ట్ కిచెన్లే: విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రణాళికను వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఇకపై స్మార్ట్ కిచెన్ల ద్వారానే ఆహారం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ భారీ ప్రాజెక్టు కోసం జిల్లాల వారీగా కిచెన్ల నిర్మాణం చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకోసం అవసరమైన భూములను వెంటనే పరిశీలించాలని కలెక్టర్లను ఆదేశించారు. కడపలో అమలు చేస్తున్న స్మార్ట్ కిచెన్ విధానాన్ని ఇటీవలే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు చూపించామని లోకేశ్ గుర్తు చేశారు. ఈ విధానం చూసి కేంద్ర మంత్రి ఫిదా అయ్యారని, ఇది చాలా బాగుందని ప్రశంసించారని తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు కొత్త నినాదాన్ని ఇచ్చారు. 'స్మార్ట్ కిచెన్, స్మార్ట్ హెల్త్, స్మార్ట్ చిల్డ్రన్' అన్నట్టుగా మన విధానం ఉండాలని సూచించారు. ఆహారం బాగుంటేనే ఆరోగ్యం బాగుంటుందని, అప్పుడే పిల్లలు చురుగ్గా ఉంటారని సీఎం అభిప్రాయపడ్డారు. కడప జిల్లా కలెక్టర్ చెరుకూరి శ్రీధర్, తమ జిల్లాలో చేపట్టిన 'స్మార్ట్ కిచెన్ ఫర్ ఆల్ ద స్కూల్స్' ప్రాజెక్టు గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఇది చూసిన సీఎం, రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు కడప వెళ్లి అక్కడి స్మార్ట్ కిచెన్లను సందర్శించాలని, ఆ మోడల్‌ను అధ్యయనం చేయాలని ఆదేశించారు. ఆహార నాణ్యత విషయంలో రాజీపడకూడదని సీఎం స్పష్టం చేశారు. స్మార్ట్ కిచెన్ నిర్వహణకు సంబంధించి సర్టిఫికేషన్ తీసుకోవడం అభినందనీయమన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అన్నప్రసాదం నాణ్యతను ఎలా పరీక్షిస్తారో, ఇక్కడ కూడా అదే తరహాలో తనిఖీ వ్యవస్థ ఉండాలని చెప్పారు. కల్తీ లేని, పరిశుభ్రమైన ఆహారం పిల్లలకు చేరాలన్నారు. ఈ విధానాన్ని కేవలం బడి పిల్లలకే పరిమితం చేయవద్దని సీఎం సూచించారు. స్మార్ట్ కిచెన్ల ద్వారా తయారయ్యే ఆహారాన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు కూడా పంపాలన్నారు. అలాగే సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలల్లోని విద్యార్థులకు కూడా ఇక్కడి నుంచే ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కడప జిల్లాలోని అన్ని స్కూళ్లలో చిన్నారులకు, విద్యార్థులకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించాలని సీఎం అక్కడి కలెక్టర్‌ను ఆదేశించారు. ఆరోగ్యమే మహాభాగ్యం అనే సూత్రం రైతు బజార్లకు కూడా వర్తింపజేయాలని చంద్రబాబు అన్నారు. రైతు బజార్లలో ప్రకృతి వ్యవసాయ (న్యాచురల్ ఫార్మింగ్) ఉత్పత్తులు విరివిగా లభించేలా చూడాలన్నారు. వీటికి కూడా సర్టిఫికేషన్ ఉండాలని, నాణ్యమైన ఉత్పత్తులను వినియోగదారుల ఇళ్లకే డోర్ డెలివరీ చేసే వ్యవస్థను తీసుకురావాలని అధికారులకు సూచించారు.

# ఆ జిల్లాల్లో నేరాలు ఎందుకు పెరిగాయి?

**మొదటిపేజీ తరువాయి** - రాష్ట్రంలో పోలీసింగ్ అంటే నేరస్థుల్లో భయం కలగాలని, శాంతిభద్రతల విషయంలో ఏమాత్రం ఉపేక్ష వద్దని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో నేరాల సంఖ్య పెరుగుతున్న తీరుపై ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. అమరావతిలో జరిగిన కలెక్టర్ల సదస్సులో జిల్లా ఎస్పీలు, కలెక్టర్లతో శాంతిభద్రతలపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో క్రైమ్ రేట్ మొత్తం మీద తగ్గినా, కొన్ని జిల్లాల్లో మాత్రం ఆందోళనకరంగా పెరగడానికి గల కారణాలను క్షుణ్ణంగా విశ్లేషించాలని అధికారులను ఆదేశించారు. "అన్నమయ్య, కోనసీమ, నెల్లూరు, గుంటూరు, తిరుపతి జిల్లాల్లో నేరాలు ఎందుకు పెరిగాయో లోతుగా అధ్యయనం చేయాలి. కడప, అల్లూరి, ఏలూరు జిల్లాల్లో ఆస్తి సంబంధిత కేసులు ఎక్కువగా నమోదు కావడానికి కారణాలేమిటి? శాంతిభద్రతల పరిరక్షణే ప్రభుత్వానికి అత్యంత ముఖ్యం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. జిల్లాల మధ్య నేరాల రేటులో ఇంత వ్యత్యాసం ఉండటంపై దృష్టి సారించాలని సూచించారు. అంతకుముందు, రాష్ట్రంలో శాంతిభద్రతల పరిస్థితిపై డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంతో పోలిస్తే రాష్ట్రవ్యాప్తంగా నేరాల రేటు 5.5 శాతం తగ్గిందని, ముఖ్యంగా మహిళలపై నేరాలు గణనీయంగా తగ్గుముఖం పట్టాయని ఆయన వివరించారు. రాష్ట్రంలోని 16 జిల్లాల్లో నేరాలు బాగా తగ్గినప్పటికీ, కొన్ని జిల్లాల్లో వేర్వేరు కారణాలతో క్రైమ్ ట్రెండ్ పెరుగుతోందని తెలిపారు. ఉదాహరణకు, అన్నమయ్య జిల్లాలో వలస కూలీల కారణంగా కొన్ని నేరాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో డిటెక్షన్ రేటు 56 శాతంగా, రికవరీ రేటు 55 శాతంగా ఉందని తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ సీపీ రాజశేఖర బాబు మాట్లాడుతూ, టెక్నాలజీ వినియోగంతో నేరాలను అదుపు చేస్తున్నామని తెలిపారు. ఎన్టీఆర్, పశ్చిమగోదావరి సహా ఐదు జిల్లాల్లో సీసీటీవీల అనుసంధానంతో మంచి ఫలితాలు వచ్చాయని చెప్పారు. నగరంలో కమ్యూనిటీ సహకారంతో 10 వేల సీసీ కెమెరాలతో డ్యాష్ బోర్డును ఏర్పాటు చేశామని, ఫేస్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా నిందితులను పట్టుకుంటున్నామని వివరించారు. అయితే, మొత్తం మీద కొన్ని జిల్లాల పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసిన సీఎం, క్షేత్రస్థాయిలో పరిస్థితులను చక్కదిద్ది, ప్రజలకు భద్రతాభావం కల్పించాలని పోలీసు ఉన్నతాధికారులకు గట్టిగా సూచించారు.

## పంచాయతీ ఎన్నికల ఫలితాలు మా రెండేళ్ల పాలనపై తీర్పుగా భావిస్తున్నాం

**మొదటిపేజీ తరువాయి** - ధన్యవాదాలు చెప్పారు. 7,522 గ్రామ పంచాయతీలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందని, 820 సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గెలిచారని వివరించారు. 62 శాతం సర్పంచ్ స్థానాలను కాంగ్రెస్ పార్టీ గెలిచిందన్నారు. చాలా గ్రామాల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పని చేశాయని, సహకరించుకున్నాయని ఆరోపించారు. బీఆర్ఎస్, బీజేపీ కలిసి 33 శాతం సీట్లను గెలుచుకున్నాయని పేర్కొన్నారు. '94 శాసనసభ నియోజకవర్గాల్లో పంచాయతీ ఎన్నికలు జరిగాయి. 87 శాసనసభ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ ఆధిక్యం సాధించింది. బీఆర్ఎస్ 6 నియోజకవర్గాల్లో మెజార్టీ స్థానాలు సాధించింది. ముథోల్ నియోజకవర్గంలో బీజేపీ అధిక స్థానాలు గెలిచింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ఇప్పుడు 21 నియోజకవర్గాల్లో ఆధిక్యం సాధించాం. రెండు ఉపఎన్నికల్లోనూ కాంగ్రెస్ స్పష్టమైన ఆధిక్యం సాధించాం. పేదలకు మేం అందిస్తున్న సంక్షేమ పథకాలే మా విజయానికి కారణం. సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో కొనసాగిస్తున్నాం. ఈ ఎన్నికల్లో ఎలాంటి అధికారిక దుర్వినియోగానికి ప్రభుత్వం పాల్పడలేదు. పూర్తిగా స్వేచ్ఛాయుత, ప్రజాస్వామ్య వాతావరణంలో ఎన్నికలు జరిగాయి.' అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్పీకర్ నిర్ణయంపై బీఆర్ఎస్ నేతల మాటలు వారి అవగాహన రాహిత్యానికి నిదర్శనమేనని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రాజ్యాంగంపై అవగాహన లేనట్లుగా బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారని ఆగ్రహించారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలనే తమవారు కాదని బీఆర్ఎస్ నేతలు అనటం హాస్యాస్పదమని అన్నారు. ప్రధాని మార్పు గురించి నాకు ఎలాంటి సమాచారం లేదని చెప్పారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మాగాంధీ పేరును తొలగించటం దారుణమని సీఎం రేవంత్‌రెడ్డి ఆగ్రహించారు. కేంద్రంలోని బీజేపీ రాహుల్‌గాంధీపై కోపంతో రాజకీయం చేస్తోందని ధ్వజమెత్తారు. గాంధీ అనే పేరు ఎక్కడా కనిపించ కూడదని కేంద్రంలోని బీజేపీ దురాలోచన అని విమర్శించారు. 2029 ఎన్నికల్లోనూ ఇవే ఫలితాలు వస్తాయని, ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ 2/3 వంతు సీట్లు, బీఆర్ఎస్-బీజేపీకి కలిపి 1/3 వంతు సీట్లు వస్తాయని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీ మధ్య అవగాహన భవిష్యత్ పొత్తుకు ఇదే నిదర్శనమని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

## ప్రధాని మోదీకి ఒమన్ అత్యున్నత పురస్కారం



**మొదటిపేజీ తరువాయి** - నెల్సన్ మండేలా వంటి ప్రపంచ ప్రఖ్యాత నేతలకు మాత్రమే ఈ పురస్కారం దక్కింది. రెండు రోజుల క్రితమే ఇథియోపియా అత్యున్నత పురస్కారాన్ని అందుకున్న మోదీకి ఇది 29వ అంతర్జాతీయ గౌరవం కావడం విశేషం. అంతకు ముందు, ప్రధాని మోదీ, ఒమన్ సుల్తాన్ హైథమ్ మధ్య మస్కట్‌లోని అల్ బరకా ప్యాలెస్‌లో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఇరు దేశాల మధ్య సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం కుదరడాన్ని ఇరువురు నేతలు ఒక కీలక మైలురాయిగా అభివర్ణించారు. రక్షణ, భద్రత, వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతికత వంటి పలు అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, వాణిజ్య మంత్రి పీయూష్ గోయల్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ పాల్గొన్నారు. భారత్, ఒమన్ మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి 70 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనతో ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలపడుతుందని నేతలు విశ్వాసం వ్యక్తం చేశారు. తన పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ 'మైత్రీ పర్వ్' కార్యక్రమంలో ప్రవాస భారతీయులను ఉద్దేశించి ప్రసంగించారు. అలాగే, ఇండియా-ఒమన్ బిజినెస్ ఫోరమ్‌లో పాల్గొని, ఒమన్ వ్యాపారవేత్తలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు.

## బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తల యత్నం



**మొదటిపేజీ తరువాయి** - పలువురు నాయకులు, కార్యకర్తలు నిరసన ర్యాలీకి సిద్ధమయ్యారు. వారు సమీపంలోనే ఉన్న బీజేపీ కార్యాలయానికి వెళ్లేందుకు ప్రయత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ శ్రేణులు గాంధీ భవన్ ఎదుట బైఠాయించారు. నగరం నడిబొడ్డున ఉన్న నాంపల్లి ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించారు. కాంగ్రెస్ నాయకులు గాంధీ భవన్ ప్రాంగణం నుంచి బయటకు రాకుండా పోలీసులు గేట్లు మూసివేశారు. వారు కేంద్ర ప్రభుత్వానికి, బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో గాంధీ భవన్ ప్రాంతంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. నిరసనకారులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ట్రాఫిక్‌ను పునరుద్ధరించేందుకు ప్రయత్నించారు. ఈ సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, నేషనల్ హెరాల్డ్ విషయంలో కేంద్ర ప్రభుత్వం గాంధీ కుటుంబాన్ని లక్ష్యంగా చేసుకోవడం మానివేయాలని అన్నారు. తన తప్పును బీజేపీ అంగీకరించి సోనియా గాంధీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష నాయకుడిని లక్ష్యంగా చేసుకుని, కాంగ్రెస్ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు బీజేపీ కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నిరసనలు చేపట్టింది. వరంగల్, నల్గొండ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, ఖమ్మం, మహబూబ్ నగర్ సహా వివిధ ప్రాంతాల్లో నిరసన ర్యాలీలు చేపట్టారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు. కరీంనగర్‌లో బండి సంజయ్ కార్యాలయాన్ని ముట్టడించేందుకు ప్రయత్నించగా, బీజేపీ కార్యకర్తలు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలను పోలీసులు నిలువరించారు.

# రోబోటిక్ సర్జరీ లో రికార్డులను తిరగరాసిన యశోద హాస్పిటల్స్

**ఒక్క ఏడాదిలోనే వెయ్యికి పైగా సంక్లిష్టమైన రోబోటిక్ సర్జరీలు**







**సికింద్రాబాద్, డిసెంబర్ 18 ( ప్రజామంటలు) :** యశోద హాస్పిటల్స్%-%హైటెక్ సిటీ తెలుగు రాష్ట్రాల వైద్య రంగంలో చారిత్రాత్మక ఘనతను సాధించింది. కేవలం ఒక్క సంవత్సరంలోనే 1,000కు పైగా అత్యంత సంక్లిష్టమైన మేజర్ రోబోటిక్ సర్జరీలను విజయవంతంగా పూర్తిచేసి, అధునాతన రోబోటిక్ శస్త్రచికిత్సల రంగంలో తన అగ్రస్థానాన్ని మరింత బలపరిచింది. ఈ ఘనతతో తెలంగాణతో పాటు తెలుగు రాష్ట్రాలు జాతీయ స్థాయిలో ప్రముఖ మెడికల్ కేర్ హబ్‌గా గుర్తింపు పొందుతున్నాయి.ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మాదాపూర్ డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (డీసీపీ) రితి రాజ్ పాల్గొన్నారు. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. రావు, సీనియర్ సర్జన్లు, వైద్యులు, వివిధ విభాగాల వైద్య సిబ్బంది ఈ వేడుకలో పాల్గొన్నారు.డీసీపీ రితి రాజ్ మాట్లాడుతూ, “ఒక్క సంవత్సర కాలంలోనే 1,000కు పైగా విజయవంతమైన మేజర్ రోబోటిక్ సర్జరీలను పూర్తి చేయడం యశోద హాస్పిటల్స్ కే కాదు, హైదరాబాద్ నగరానికీ, తెలంగాణకు, మొత్తం తెలుగు రాష్ట్రాలకు గర్వకారణం. ఇది కేవలం ఒక సంఖ్య కాదు. వైద్య రంగంలో, ముఖ్యంగా రోబోటిక్ శస్త్రచికిత్సల్లో ఇది ఒక గొప్ప ముందడుగు. అధిక ఖచ్చితత్వం, మెరుగైన భద్రత, తక్కువ నొప్పి, వేగవంతమైన రికవరీ వంటి ప్రయోజనాలను రోగులకు అందిస్తూ యశోద హాస్పిటల్స్ క్లినికల్ ఎక్సలెన్స్ కు నిదర్శనంగా నిలుస్తోంది అని ప్రశంసించారు. యశోద హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్. రావు మాట్లాడుతూ ఈ 1,000కు పైగా రోబోటిక్ సర్జరీల మైలురాయిలో 434 గైనకాలజీ గైనక్ ఆంకాలజీ శస్త్రచికిత్సలు, 310 జనరల్, విధానాలు, 177 యూరాలజీ సర్జరీలు, 79 థొరాసిక్ సర్జరీలు, అలాగే అత్యంత క్లిష్టమైన హెడ్ / నెక్ రోబోటిక్ విధానాలు ఉన్నాయని తెలిపారు. వీటన్నింటినీ అత్యున్నత స్థాయి ఖచ్చితత్వంతో, అద్భుతమైన క్లినికల్ ఫలితాలతో నిర్వహించామని వెల్లడించారు. నూతన వైద్య సాంకేతికతలను వేగంగా స్వీకరించి, అత్యున్నత ప్రమాణాలతో అమలు చేయడమే యశోద హాస్పిటల్స్ లక్ష్యమని డాక్టర్ జి.ఎస్. రావు తెలిపారు. ఈ విజయం భారతదేశంలో రోబోటిక్ సర్జరీ రంగంలో యశోద హాస్పిటల్స్‌ను అగ్రగామి సంస్థగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తుందని ఆయన స్పష్టం చేశారు.

# మహారాష్ట్రలో జనన ధ్రువపత్రాల స్కామ్

**1500 జనాభా గ్రామంలో 3 నెలల్లో 27 వేల జననాలు**

**ముంబై డిసెంబర్ 18 (ప్రజా మంటలు) :** మహారాష్ట్ర యవత్మాల్ జిల్లాలోని శేందుర్సనీ గ్రామ పంచాయతీలో భారీ జనన ధ్రువపత్రాల స్కామ్ వెలుగులోకి వచ్చింది. కేవలం 1500 మంది జనాభా ఉన్న గ్రామంలో సెప్టెంబర్%-%నవంబర్ మధ్య కాలంలో 27,397 జననాలు సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టమ్ (%జ=ా%) లో నమోదు కావడం అధికారులను షాక్‌కు గురి చేసింది.ప్రత్యేక తనిఖీల్లో గ్రామ %జ=ా% లాగిన్ ఐడీ ముంబయికి మ్యాప్ అయి ఉండటాన్ని గుర్తించారు. దీంతో ఈ వ్యవహారం వెనుక సైబర్ క్రైమ్ రాకెట్ ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గుర్తింపు పత్రాల కోసం నకిలీ జనన ధ్రువపత్రాలు సృష్టించి ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు.ఈ ఘటనపై భాజపా మాజీ ఎంపీ కిరీట్ సోమయ్య స్పందిస్తూ, నమోదు అయిన పేర్లలో ఎక్కువవి పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్‌కు చెందినవేనని, అక్రమ వలసదారుల కోణంలోనూ దర్యాప్తు చేయాలని సీఎం దేవేంద్ర ఫడణవీస్‌ను కోరారు. పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

## జగిత్యాల రూరల్ /బీర్పూర్/ సారంగాపూర్ గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన వారిని అభినందించి శాలతో సత్కరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





**జగిత్యాల/ బీర్పూర్/ సారంగాపూర్ డిసెంబర్ 18 (ప్రజా మంటలు) :** జగిత్యాల రూరల్ మండలం తక్కల్లపల్లి గ్రామం వార్డు సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ని కలవగా వారిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.బీర్పూర్ మండలం చర్లపల్లి గ్రామం సర్పంచ్ గా మసీదు తిరుపతి, ఉప సర్పంచ్ గా వార్డు సభ్యులు గా , మరియు రంగసాగర్ గ్రామ వార్డు సభ్యులుగా ఎన్నికైన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలవగా వారిని శాల్వతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సారంగాపూర్ మండల పోతారం గ్రామ సర్పంచ్ గా జ్యోతి, శ్రీనివాస్.ఉప సర్పంచ్. వార్డు సభ్యులు మరియు లక్ష్మీదేవి పల్లె గ్రామ ఉప సర్పంచ్ మతులపురం ఉపేందర్ వార్డు సభ్యులు గా .నూతనంగా ఎన్నికైన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలవగా ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# డిల్లీ హైకోర్టు తీర్పుతోనైనా బీజేపీ కి కనువిప్పు కలుగాలి

**వేధింపుల రాజకీయం మానుకొని.. ప్రజా సంక్షేమంపై దృష్టి సారించాలి...**

**ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు తొలగించాలనే ప్రతిపాదన ఉపసంహరించుకోవాలి..**

**మాజీ మంత్రి తాటిపర్తి జీవన్ రెడ్డి**







**జగిత్యాల డిసెంబర్ 18 (ప్రజా మంటలు) :** ఇందిరా భవన్ నుండి తహశీల చౌరస్తా వరకు కాంగ్రెస్ నాయకులూ,కార్యకర్తల ర్యాలీ నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ నినాదాలు చేశారు.తహసిల్ చౌరస్తాలో కాంగ్రెస్ శ్రేణుల బైఠాయించారు.నేషనల్ హెరాల్డ్ పత్రిక కేసులో దశాబ్ద కాలంగా బీజేపీ ప్రభుత్వం కుట్ర పూరిత రాజకీయాలతో ఈడీ దాడులతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీని వేధిస్తోందని,డిల్లీ హై కోర్టు తీర్పు బీజేపీ ప్రభుత్వానికి చెంప పెట్టు అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు.జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్య అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ధర్నా చేపట్టారు. నేషనల్ హెరాల్డ్ కేసులో కేంద్ర ప్రభుత్వ కుట్ర పూరిత రాజకీయాలతో వేధించిన బీజేపీకి వ్యతిరేకంగా జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ నుండి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు, పట్టణ కాంగ్రెస్ నాయకులు , మహిళా కాంగ్రెస్ నాయకులు , అనుబంధ సంఘాల సభ్యులు నాయకులు కాంగ్రెస్ పార్టీ జెండాలు పట్టుకొని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ స్థానిక తహసీల్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, రోడ్డు పై బైఠాయించి, నిరసన వ్యక్తం చేశారు.మాజీ మంత్రి జీవన్ రెడ్డి మాట్లాడుతూ... నేషనల్ హెరాల్డ్ పత్రికను చట్టబద్ధంగా యంగ్ ఇండియా లింటెడ్ అప్పగిస్తే, అవినీతి జరిగిందంటూ దశాబ్ద కాలానికి పైగా సోనియా, గాంధీ, రాహుల్ గాంధీని ఈ డీ కేసులతో వేధించింది.డిల్లీ హై కోర్టు తీర్పుతో సోనియా గాంధీ, రాహుల్ గాంధీ నిజాయితీ మరోసారి రుజువు అయిందన్నారు.ఏవిధమైన ఆధారాలు లేకుండా దేశ స్వాతంత్ర్యం కోసం త్యాగం చేసిన కుటుంబాలు వేదిస్తున్నారు.డిల్లీ హై కోర్టు లో చార్జ్ షీట్ దాఖలు చేయడం బీజేపీ కుట్ర పూరిత రాజకీయాలకు నిదర్శనం.రెండు దశాబ్దాలుగా గ్రామీణ నిరుపేదలకు ఉపాధి కల్పిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని నీరుగార్చేందుకు కుట్ర చేస్తోంది.మహాత్మ గాంధీ పేరు మీదుగా కొనసాగుతున్న ఉపాధి హామీ పథకానికి పేరు మార్చే కుట్ర చేస్తు, బీజేపీ కుట్రపూరిత రాజకీయాలు చేస్తోంది.డిల్లీ హైకోర్టు తీర్పుతో బీజేపీ ఇకనైనా కళ్ళు తెరవాలి.నేషనల్ హెరాల్డ్ కేసు లో కాంగ్రెసు నాయకులను బీజేపీ వేధింపులను ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఉపాధి హామీ పథకానికి మహాత్మ గాంధీ పేరు తొలగించే ప్రతిపాదన ఉపసంహరిం చుకోవాలని,ఉపాధి హామీ పథకంలో ప్రజలకు ఉపయోగపడేవిధంగా మార్పులు చేయాలని డిమాండ్ చేశారు.డీ సీసీ అధ్యక్షుడు గాజంగి నందయ్య మాట్లాడుతూ.. భారతీయుల స్వేచ్ఛ సమానత్వం కోసం జవహర్లాల్ నెహ్రూ నేషనల్ హెరాల్డ్ పత్రిక స్థాపించారు.అవినీతి ఆరోపణలతో, పదేళ్లుగా బీజేపీ ప్రభుత్వం కాంగ్రెస్ నాయకులను వేధిస్తోందనీ అన్నారు. బీజేపీ కుల,మత రాజకీయాలు చేస్తూ..ప్రజలను రెచ్చగొడుతూ పబ్బం గడుపుకుంటోం దన్నారు.రాహుల్ గాంధీ నీ దేశ ప్రధాన మంత్రిని చేయడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు.

## రాయికల్ మండలం పలు గ్రామపంచాయతీ సర్పంచి వార్డు సభ్యులను సత్కరించిన ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్





**రాయికల్ డిసెంబర్ 18 ( ప్రజా మంటలు) :** మండలం మాంఖ్యానాయక్ తండ సర్పంచ్ గా మాలోత్ తిరుపతి, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యులు నూతనంగా ఎన్నికైనందున మరియు ఓడ్డేలింగాపూర్ ఉపసర్పంచిగా బుక్యా శేఖర్ ఎన్నికైన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలువగా వారిని శాలువాతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు.రాయికల్ .. కురుమ పల్లి కుర్మపల్లి గ్రామ వార్డు సభ్యులు గా .నూతనంగా ఎన్నికైన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ని మర్యాదపూర్వకంగా కలవగా ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.రాయికల్...... ఇటిక్యాల ఇటిక్యాల గ్రామ సర్పంచ్ గా నిరేటి శ్రీనివాస్ నూతనంగా ఎన్నికైన సందర్భంగా జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలవగా ఈ సందర్భంగా వారిని శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను మరిచిపోయింది

**కల్వకుంట్ల కవిత**







**కొత్తగూడెం డిసెంబర్ 18 :ప్రజా మంటలు):** తెలంగాణ జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత కొత్తగూడెం జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. రెండు రోజుల పాటు జిల్లాలో ప్రజల సమస్యలను తెలుసుకొని, బాధితులతో నేరుగా మాట్లాడి పరిష్కార దిశగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.ఇల్లందు: దర్గా%-%ఆలయ సందర్శన, మత సామరస్యానికి నిదర్శనం ఇల్లందు మండలం సత్యనారాయణ పురంలోని హజ్రత్ నాగుల్ మీరా దర్గాను సందర్శించిన కవిత ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దర్గా విషయంలో ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ తీవ్ర ఇబ్బందులు పెడుతోందని ఆరోపించారు. ఉర్సు సందర్భంగా వేలాది మంది భక్తులు వస్తున్నప్పటికీ కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. దర్గా పక్కనే రాముల వారి ఆలయం ఉండటం హిందూ%-%ముస్లిం ఐక్యతకు చక్కని ఉదాహరణగా పేర్కొన్నారు. శాశ్వత నిర్మాణాలకు అనుమతులు ఇవ్వాలని, మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, మిషన్ భగీరథ ద్వారా నీటి సదుపాయం కల్పించాలని మంత్రులను డిమాండ్ చేశారు. సర్పంచ్ ఎన్నికలపై వ్యాఖ్యలు సర్పంచ్ ఎన్నికల్లో గుర్తులు లేనప్పుడు పార్టీలు గొప్పలు చెప్పుకోవడం అనవసరమని కవిత వ్యాఖ్యానించారు. గ్రామస్తులు పరిచయాలు, పనితీరు ఆధారంగా ఓటేస్తారని తెలిపారు. ఎన్నికల అనంతరం అయినా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలని, లేదంటే ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కాంగ్రెస్ హామీలపై విమర్శ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను మరిచిపోయిందని కవిత విమర్శించారు. మహిళలకు రూ.2,500 హామీ, పెన్షన్ల పెంపు, ఉచిత కరెంట్ వంటి హామీలు అమలు కాలేదన్నారు. భర్త చనిపోయిన మహిళలకు పదేళ్లుగా పెన్షన్లు రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

**కొత్తగూడెం: జాగృతి జెండా ఆవిష్కరణ**

కొత్తగూడెం ఎంజీ రోడ్డులోని మార్కెట్‌లో జాగృతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ జగదీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన తెలంగాణ జాగృతి జెండాను కవిత ఆవిష్కరించారు. ప్రజాస్వామ్య విలువలు రాష్ట్రంలో ప్రమాదంలో పడ్డాయని, పార్టీ మారిన ఎమ్మెల్యేల విషయంలో స్పీకర్ తీర్పు రాజ్యాంగ విరుద్ధమని విమర్శించారు.తాను బీఆర్ఎస్ నుంచి బయటకు వచ్చిన వెంటనే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేసినప్పటికీ ఇప్పటివరకు దానిపై చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు.

**సింగరేణి అంశంపై తీవ్ర ఆందోళన**

సింగరేణిని ప్రైవేట్‌కు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. డిపెండెంట్ ఉద్యోగాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని, సింగరేణి హాస్పిటల్, స్కూల్ వ్యవస్థను వెంటనే మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల కోసం నిరంతరం పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

**కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి సందర్శన**

కొత్తగూడెం ప్రభుత్వ సర్వజనీన ఆసుపత్రిని సందర్శించిన కవిత, రోగులు, వైద్యులు, సిబ్బందితో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు.

650%-%750 పడకల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ అవసరమని, కార్డియాలజీ, నెఫ్రాలజీ, యూరాలజీ వంటి విభాగాలు లేవని తెలిపారు. పిడియాట్రిక్ విభాగంలో డాక్టర్ల కొరత, ఎక్స్‌రే, ఎంఆర్ఐ స్కాన్ సదుపాయాల లేమిపై ఆందోళన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ సిబ్బందికి ఉద్యోగ భద్రత, హెల్త్ పాలసీ కల్పించాలని డిమాండ్ చేశారు.

**పాల్వంచ – మణుగూరు**

పాల్వంచలో పెద్దమ్మ తల్లి ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మణుగూరులో ఇటీవల మృతి చెందిన జాగృతి నాయకురాలు మల్లీశ్వరి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

## మాస శివరాత్రి సందర్భంగా సహస్ర లింగాలకు సహస్ర వస్త్రాల అలంకరణ ప్రత్యేక పూజలు



**జగిత్యాల డిసెంబర్ 18 (ప్రజా మంటలు) :** రూరల్ పొలాస గ్రామంలోని సహస్ర లింగాల దేవాలయంలో మాస శివరాత్రి సందర్భంగా ప్రత్యేక పూజలు ఈ సందర్భంగా గురువారం మాస శివరాత్రి పురస్కరించుకొని ఆలయాన్ని సర్వంగ సుందరంగా అలంకరించి సహస్ర లింగాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలను నిర్వహించి సహస్ర లింగాలకు భక్తుల స్వహస్తాలతో అభిషేకించి చక్కగా అలంకరించి స్వామివారికి మంగళహారతులను సమర్పించారు. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని సహస్ర లింగాలను దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు నలమాసు గంగాధర్ ఆలయ కమిటీ సభ్యులు భక్తులు ప్రముఖులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణలో మహిళా రిజర్వేషన్‌పై సుప్రీంకోర్టు సానుకూల స్పందన

**డాక్టర్ సుభాషిణి గుడిమల్ల హర్షం**



**సికింద్రాబాద్, డిసెంబర్ 18 ( ప్రజామంటలు):** తెలంగాణ బార్ కౌన్సిల్‌లో మహిళలకు రిజర్వేషన్ కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా తమ విలువైన సమయాన్ని కేటాయించిన ప్రతి ఒక్కరికీ అభినందనలు తెలుపుతున్నట్లు సీనియర్ న్యాయవాది డాక్టర్ గుడిమల్ల సుభాషిణి తెలిపారు. ఈ అంశంపై గౌరవ సుప్రీంకోర్టు సానుకూలంగా స్పందించడంతో తుది ఉత్తర్వుల కోసం ఆశతో ఎదురుచూస్తున్నామని తెలిపారు.ఈ ఉద్యమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా బార్ అసోసియేషన్లు సహకరించాయని పేర్కొన్నారు. ముఖ్యంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు మరియు వారి బృందాలు అందించిన మద్దతుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ విషయాన్ని సుప్రీంకోర్టులో పిటిషన్ ద్వారా ముందుకు తీసుకెళ్లిన ఇంటర్వీనర్ డా. సుభాషిణి గుడిమల్ల మాట్లాడుతూ..మహిళా న్యాయవాదులకు సముచిత ప్రాతినిధ్యం కల్పించే దిశగా ఇది కీలక ముందడుగు అని అన్నారు.ఈ కార్యక్రమానికి ప్రీతి, సుమిత్ర, రజిత, శ్రీలత, చైతన్య, చందన, చందన జైన్, అమర్ పాలి, అరుణ కుమారి, రచన, షిరాజ్ ఖాన్, కనకదుర్గ తదితర హైకోర్టు న్యాయవాదులు మద్దతు తెలిపారు.

# ఈ నెల 24 న పెన్షనర్ల నిరాహార దీక్షలు

**రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వెల్లడి.**




**జగిత్యాల డిసెంబర్ 18 (ప్రజా మంటలు) :** జిల్లా కేంద్రాలలో ఈ నెల 24 న నిరాహార దీక్షలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు జగిత్యాల జిల్లా రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ వెల్లడించింది.గురువారం మధ్యాహ్నం 12 గంటలకు పెన్షనర్స్ భవన్ లో జిల్లా అధ్యక్షులు ఏ.నరేందర్ రావు అధ్యక్షతన సమావేశం జరిగింది.ఈ సమావేశంలో నరేందర్ రావు, కార్యదర్శి ఎన్నం రాంరెడ్డి లు మాట్లాడుతూ 2024 మార్చి నుండి రిటైర్డ్ అయిన ఉద్యోగుల రిటైర్మెంట్ బకాయిలు ఇవ్వనందున చాలామంది మానసిక ఒత్తిడికి లోనై అసులుబాశారని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వానికి పలుమార్లు విన్నవించిన, స్పందించకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో ఈ నెల 24 న నిరాహార దీక్షలు చేపట్టాలని రాష్ట్ర కమిటీ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఇందు కోసం గురువారం సన్నాహక సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు.ఈ నిరాహార దీక్షకు రిటైర్డ్ బకాయిలు రాని ఉద్యోగులతో పాటు సర్వీస్ ఉద్యోగులు, పెన్షనర్స్ ఎక్కువ సంఖ్యలో హాజరై ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని నిర్ణయించడం జరిగిందన్నారు.ఈ నిరాహార దీక్షకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయగలరని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అయిల్నేని నరేందర్ రావు, ఎన్నం రాంరెడ్డి, కోశాధికారి మామిడాల లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు జి.దుబ్బయ్య, బి.రాజేశం, ఎ.చంద్రమౌళి, ఎం.శంకరయ్య, యకె. సదానందచారి, టి.గంగరాజం, కొండపలుకుల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.ద

# గొల్లపల్లి ఇండిపెండెంట్ సర్పంచ్

**నల్ల నీరజ సతీష్ రెడ్డి విజయోత్సరాలి**





**గొల్లపల్లి డిసెంబర్ 18 ప్రజా మంటలు ( ప్రతినిధి అంకం భూమయ్య) :** గొల్లపల్లి మండల కేంద్రంలో ఇండిపెండెంట్ సర్పంచ్ విజయోత్స ర్యాలీ అంబేద్కర్ చౌరస్తా నుండి నల్ల గుట్ట వరకు గొల్లపల్లి సర్పంచ్‌గా నన్ను గెలిపించిన సందర్భంగా గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తానని సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి గురువారం మండల కేంద్రంలో బారి ర్యాలీ నిర్వహించారు అనంతరం సర్పంచ్ నీరజ సతీష్ రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు నల్ల రాజిరెడ్డి చేసిన సేవలను గుర్తించి అధిక మెజారిటీతో గెలిపించిన గ్రామ ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు.గొల్లపల్లి గ్రామ అభివృద్ధి కోసం మీ ముందుకు వచ్చానని,నిస్వార్థంగా గ్రామ అభివృద్ధి కోసం కృషి చేస్తానని గ్రామానికి సేవ చేసే భాగ్యం కల్పించిన ప్రజలందరికీ అందుబాటులో ఉంటూ సమస్యలు పరిష్కరిస్తానని అభివృద్ధికి కోసం తనకు ప్రజా సేవ చేయాలని తపన ఉందని నాకు ఈ అవకాశం ఇచ్చిన గొల్లపల్లి గ్రామ ప్రజలుకు నల్ల నీరజ సతీష్ రెడ్డి పంచాయతీ నూతన కార్యవర్గ సహకారంతో ముందుకు నడిపిస్తానని ఆశయంతో మహిళలకు గ్రామ కుల సంఘాల పెద్దలు యువత మహిళలు వ్యాపారస్తులు స్నేహితులు శ్రేయోభిలాషులు నా విజయానికి తోడ్పడిన ప్రతి ఒక్కరికి పేరు పేరునా కృతజ్ఞతలు తెలియజేశారు.

## వరంగల్ సీకేఎం ప్రసూతి ఆసుపత్రిలో ఎలుకల బెడద

**స్టేట్ హ్యుమన్ రైట్స్ కమిషన్ సీరియస్**

**రామారావు ఇమ్మానేని ఫిర్యాదుతో కేసు నమోదు**



**సికింద్రాబాద్, డిసెంబర్ 18 ( ప్రజామంటలు):** చందా కాంత మెమోరియల్ (సీకేఎం) ప్రభుత్వ ప్రసూతి– శిశు సంరక్షణ ఆసుపత్రిలో ఎలుకలు స్వేచ్ఛగా తిరుగుతున్న ఘటనపై తెలంగాణ రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ (టీజీ ఎస్హెచ్ఆర్సీ) సీరియస్ అయింది. ఇంక్యుబేటర్ వార్డు సహా ప్రసూతి, పిల్లల వార్డుల్లో ఎలుకలు తిరుగుతున్న దృశ్యాల వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో మానవ హక్కుల ఉల్లంఘనగా గుర్తించి కేసు నమోదు చేసింది.సిటీకి చెందిన ప్రముఖ మానవ హక్కుల న్యాయవాది రామారావు ఇమ్మానేని ఫిర్యాదుతో హెచ్ఆర్సీ కేసు నెం.3786/36/31/2025గా నమోదు అయింది. ఎలుకల బెడద వల్ల నవజాత శిశువులు, కొత్త తల్లులు గాయపడుతున్నారని, ఆసుపత్రి భద్రత–పరిశుభ్రతపై తీవ్రమైన సందేహాలు తలెత్తుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ఆరోగ్యం, వైద్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిస్టినా జెడ్. చోంగ్తు ద్వారా సమగ్ర విచారణ చేపట్టాలని, హౌస్‌కీపింగ్, పారిశుధ్యం, భద్రత, తెగులు నియంత్రణకు నియమిత ప్రైవేట్ ఏజెన్సీల నిర్లక్ష్యాన్ని పరిశీలించాలని, బాధితులకు తక్షణ వైద్యసేవలతో పాటు పరిహారం చెల్లించాలని కమిషన్‌ను కోరారు.

# రూ.లక్షకు కొని రూ.5 లక్షలకు అమ్మకం

**పిల్లలను విక్రయిస్తున్న ముఠా అరెస్టు**

**బలగం సరోజినీ సహా మరో నలుగురిని అరెస్టు**

**బలగం సరోజినీ, ఫరీనాపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్న పోలీసులు**

పిల్లలను విక్రయిస్తున్న ముఠాలో ప్రధాన నిందితురాలు బలగం సరోజినీతో సహా మరో నలుగురిని అరెస్టు చేశామని విజయవాడ సీపీ రాజశేఖర్ బాబు తెలిపారు. నిందితుల నుంచి ఆరుగురు పిల్లలను రక్షించామన్నారు. పిల్లలను దిల్లీ నుంచి రూ.లక్ష రూపాయలకు కొని రూ.5 లక్షలకు విక్రయిస్తున్నట్లు చెప్పారు. మార్చి 1న విజయవాడలో ఈ ముఠాను అరెస్టు చేయగా ఇప్పటివరకు పిల్లల విక్రయం కేసులో 10 మందిని అరెస్టు చేసినట్లు సీపీ వెల్లడించారు. సరోజినీతో పాటు షేక్ ఫరీనా అనే వ్యక్తి ముఠాలో ఉన్నట్లు ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు చేయనున్నట్లు సీపీ తెలిపారు.ముంబై నుంచి ముగ్గురు వ్యక్తుల ద్వారా లక్ష రూపాయలకు సరోజిని కొని ఇక్కడ అమ్ముతోందని తెలిపారు. ఆరుగురు శిశువులను విక్రయించిన క్రమంలో పోలీసులు చాకచక్యంగా ముఠాలోని సభ్యులను పట్టుకున్నారు. పిల్లలను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు జరిపారు. ఆరుగురు చిన్నారులను అక్రమార్కుల చేతుల్లో నుంచి క్షేమంగా కాపాడారు. ఈ ముఠాపై మొత్తం 3 కేసులు నమోదు చేసినట్లు సీపీ వెల్లడించారు.'చిన్నపిల్లలను విక్రయిస్తున్న ముఠాను గతంలో అరెస్టు చేశాం. మళ్లీ ఇదే పని చేస్తున్నారు. ఈ కేసును సీరియస్?గా తీసుకుంటున్నాం. బలగం సరోజినీ సహా మరో నలుగురిని అరెస్టు



చేశాం. వీరి నుంచి ఆరుగురు చిన్నారులను కాపాడాం. వీరు దిల్లీ, ముంబై నుంచి కొనుగోలు చేస్తున్నారు. అక్కడ రూ.లక్షకు కొని ఇక్కడ రూ.5 లక్షలకు అమ్ముతున్నారు. గతంలో కూడా వీరిపై కేసులు ఉన్నాయి.'పసిపిల్లల్ని అమ్మి సొమ్ము చేసుకుంటున్న ఘరానా లేడీ ముఠాను గతంలో విజయవాడ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. ఏడుగురు శిశువులను విక్రయించిన క్రమంలో పోలీసులు చాకచక్యంగా ముఠాలోని కొంతమంది సభ్యులను పట్టుకున్నారు. ముగ్గురు శిశువులను అమ్మేందుకు ప్రయత్నిస్తున్నట్లు వచ్చిన పక్కా సమాచారంతో పోలీసులు తనిఖీలు చేపట్టగా ఈ ముఠా గుట్టురట్టు అయింది. ఆ ముగ్గురి చిన్నారులను అక్రమార్కుల చేతుల్లో నుంచి క్షేమంగా కాపాడారు.ఉత్తరాది రాష్ట్రాల నుంచి శిశువులను తీసుకొచ్చి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో విక్రయిస్తున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించారు. మాతృశోకాన్ని మిగులుస్తోన్న ఈ ముఠా మూలాలను వెలికితీసేందుకు విజయవాడ పోలీసు కమిషనర్ ఎస్.వి రాజశేఖర్‌బాబు ప్రత్యేక బృందాలతో ఏర్పాటు చేశారు. విక్రయించిన నలుగురు శిశువులను కూడా త్వరిగతిన కాపాడేందుకు బృందాలు అప్పట్లో విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టాయి. దిల్లీ, అహ్మదాబాద్ తదితర ప్రాంతాల నుంచి పిల్లలను తీసుకు వచ్చి విక్రయిస్తూ ఈ ముఠా కార్యకలాపాలు సాగిస్తోంది. ఇప్పటికే సరోజిని 19 మందిని విక్రయించినట్లు పోలీసులు గుర్తించారు. రాచకొండ పోలీసు కమిషనరేట్, ముంబైలలో ఆమెపై పలు పోలీసు కేసులు ఉన్నాయి. ఈమెకు 17 మంది వరకు సహాయం చేస్తున్నట్లు సమాచారం ఉందని విజయవాడ సీపీ రాజశేఖర్?బాబు పేర్కొన్నారు. ఈ ముఠాలోని కీలక వ్యక్తులను గుర్తించేందుకు, ఇతర రాష్ట్రాల పోలీసుల సహకారం కూడా తీసుకుంటామని వెల్లడించారు. సరోజినిపై పీడీ యాక్ట్ కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. శిశువులను విక్రయించిన వారే కాకుండా కొనుగోలు చేసిన వారి పైనా కేసులు తప్పవని ఆయన స్పష్టం చేశారు.బలగం సరోజిని వయసు 31 ఏళ్లు. 7వ తరగతి వరకు చదువుకుంది. ఇప్పటికే శిశు విక్రయ కేసులో అరెస్టు అయి జైలుకెళ్లి వచ్చింది. అయినా ఆమె తన నేరప్రవృత్తిని మార్చుకోలేదు. తనకు ఇద్దరు పిల్లలు ఉన్నప్పటికీ శిశు విక్రయాల ద్వారా వారి మాతృమూర్తులకు గర్భశోకం కలిగించడం తీవ్రమైన నేరంగా భావిస్తున్నట్లు విజయవాడ పోలీసులు తెలిపారు.

# కేఎల్ వర్సిటీలో యూత్ ఫెస్ట్

**పాల్గొన్న 26 జిల్లాల యువత**

**వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు ప్రారంభం**

**ఎంపికైన విజేతలకు జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం**

యువతలో సృజనాత్మకత, నాయకత్వ లక్షణాలు వెలికి తీయడానికి యువ సంకల్పం-2025 పేరిట 3 రోజులపాటు రాష్ట్ర యువజనోత్సవం జరగనుంది. ఈ సందర్భంగా గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో ఈ రాష్ట్రస్థాయి యువజనోత్సవాలు ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలను యువజన సంక్షేమ కమిషనర్ భరణి ప్రారంభించారు. యువతలో సృజనాత్మకతను, నాయకత్వ లక్షణాలను పెంపొందించడమే లక్ష్యంగా కార్యక్రమం నిర్వహిస్తున్నారు. 26 జిల్లాల నుంచి వేల మంది యువత కార్నివాలాలో పాల్గొన్నారు.జిల్లా స్థాయిలో ఎంపికైన యువతీ, యువకులు వివిధ సాంస్కృతిక, కళాత్మక, సాహిత్య కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్రస్థాయి పోటీలకు హాజరయ్యారు. రాష్ట్రస్థాయి యువజన ఉత్సవాల్లో భాగంగా జానపద నృత్యాలు, జానపద గీతాలు, శాస్త్రీయ నృత్యాలు, శాస్త్రీయ సంగీతం, నాటకాలు, చిత్రలేఖనం, కవిత్వం, కథా రచన, ప్రసంగం, క్విజ్, ఫోటోగ్రఫీ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు.ఎంపికైన విజేతలకు జాతీయస్థాయిలో ప్రాతినిధ్యం వహించే అవకాశం ఉంటుంది. ఇది కేవలం ఉత్సవం కాదని, యువజన ఉద్యమమని కమిషనర్ ఎస్. భరణి అన్నారు. యువతలో దాగి ఉన్న ప్రతిభకు సరైన వేదికను కల్పించడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. ?ఈ ఏడాది పోటీలతోపాటు యూత్-కాన్, యూత్ ఛేంజ్ మేకర్ టాక్స్, యువ సంకల్ప వంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టామని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రతిభావంతులను రాష్ట్ర యువతతో అనుసంధానం చేయడానికి 'గ్లోబల్ డయాస్పోరా కనెక్ట్' కార్యక్రమాన్ని రూపొందించామని స్పష్టం చేశారు. తద్వారా ద్వారా యువతకు అంతర్జాతీయ స్థాయి మెంటార్‌షిప్ అందుతుందని కమిషనర్ భరణి అభిప్రాయపడ్డారు. ''ఇది కేవలం ఉత్సవం కాదు యువజన ఉద్యమం. యువతలో దాగి ఉన్న ప్రతిభకు సరైన వేదికను కల్పించడమే ఈ ఉత్సవాల ముఖ్య ఉద్దేశం. ఈ ఏడాది పోటీలతోపాటు యూత్-కాన్, యూత్ ఛేంజ్ మేకర్ టాక్స్, యువ సంకల్ప వంటి వినూత్న కార్యక్రమాలను ప్రవేశపెట్టాం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రతిభావంతులను రాష్ట్ర యువతతో అనుసంధానం చేయడానికి 'గ్లోబల్ డయాస్పోరా కనెక్ట్' కార్యక్రమాన్ని రూపొందించాం. తద్వారా యువతకు అంతర్జాతీయ స్థాయి



మెంటార్‌షిప్ అందుతుంది.''యువజన సదస్సులు, ఛేంజ్ మేకర్ టాక్స్, ఇండస్ట్రీ నిపుణులతో మెంటరింగ్ సెషన్స్ ఉంటాయి. ఇక్కడ ప్రతిభ చాటిన విజేతలు జనవరిలో దిల్లీలో జరిగే జాతీయ యువజనోత్సవాల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించనున్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా యువతలో చైతన్యం నింపడం కోసం డిజిటల్ మారథాన్ నిర్వహిస్తున్నారు. యువత తమ ఆలోచనలను వీడియోల రూపంలో సోషల్ మీడియాలో పంచుకునే వీలు కల్పించారు. స్మార్ట్ యూత్ ఏపీ', 'ఫిట్ యూత్ ఏపీ' వంటి థీమ్స్ కేటాయించారు.రాష్ట్ర యువజన శాఖ, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఇతర అనుబంధ విభాగాల ఆధ్వర్యంలో ఈ ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ప్రతిభ కనబరిచిన వారికి లక్ష రూపాయల వరకు నగదు బహుమతులు అందించడంతోపాటు ఆంధ్ర యూత్ బ్రాండ్ అంబాసిడర్‌గా గుర్తింపు లభించనుంది. డిజిటల్ నైపుణ్యాలను యువతలో పెంపొందించడం వారి సృజనాత్మకతకు ఆదాయ వనరులు కల్పించడం ప్రధాన ఉద్దేశ్యమని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ అసోయేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్. భరణి అంటున్నారు.

# జీతం రూ.42 వేల కన్నా తక్కువ ఉంటే మీరు కూడా ఈఎస్ఐకి అర్హులే!

**మూల వేతనం, డీఏ రూ.21 వేల కంటే తక్కువగా ఉంటే ఈఎస్ఐసీ (కార్మిక రాజ్య బీమా సంస్థ) పరిధిలోకి**

**కొత్తగా కార్మిక శాఖ నిబంధనలు**

**సామాజిక భద్రత కోడ్‌లో 50శాతం నిబంధన**

కార్మికులకు శుభవార్త! కొత్తగా అమల్లోకి వచ్చిన సామాజిక భద్రత కోడ్‌లో వేతన వివరణను కేంద్ర ప్రభుత్వం మార్చడంతో భారీసంఖ్యలో కార్మికులు ఈఎస్ఐసీ (కార్మిక రాజ్య బీమా సంస్థ) వైద్యసేవల కిందకు రానున్నారు. నిబంధనలకు అనుగుణంగా రూ.42 వేల కన్నా తక్కువ వేతనం పొందుతున్న కార్మికులు కూడా బీమా వైద్య సేవలు పొందే అవకాశాలున్నాయి. ఇప్పటి వరకు మూలవేతనం, డీఏ, మొదలగు అలవెన్సులన్నీ కలిపి నెలకు వేతనం రూ.21 వేల లోపు ఉంటే ఈఎస్ఐసీలోకి వచ్చేవారు. ఇక నుంచి మూలవేతనం, డీఏ కలిపి రూ.21 వేలలోపు ఉంటే అర్హులవుతారు. కార్మికులకు ఇచ్చే వేతనాల వివరణపై ఇటీవల ఈఎస్ఐసీ కేంద్ర కార్యాలయం ఆదేశాలు జారీచేసింది. కొత్త వేతన వివరణల ఆధారంగా ఈఎస్ఐసీ సేవలు లభించని కార్మికులను బీమా వైద్యసేవల పరిధిలోకి తీసుకురావాలని ప్రాంతీయ సంచాలకులకు ఆదేశాలిచ్చారు. కొత్త వేతన వివరణపై యాజమాన్యాలకు అవగాహన కల్పించాలని స్పష్టంచేశారు. కొన్ని సంస్థల్లో ఈపీఎఫ్ పరిధిలోకి వచ్చే ఉద్యోగుల సంఖ్య ఎక్కువ. బీమా వైద్యసేవల పరిధిలోకి వచ్చేవారి సంఖ్య తక్కువ. వారందరనీ ఈఎస్ఐ పరిధిలోకి తీసుకురావాలని సూచించారు.ఇంటిఅద్దె, గ్రాట్యుటీ, ఈపీఎఫ్, బోనస్, ట్రావెలింగ్ అలవెన్సు, ఓవర్ టైం అలవెన్సు, ప్రత్యేక చెల్లింపులు, ఉద్యోగులకు ఇచ్చే కమీషన్లు, పదవీ విరమణ ప్రోత్సాహకం కాకుండా మిగతావన్నీ చెల్లించే వేతనంలో సగానికన్నా ఎక్కువగా ఉండకూడదు. ఒకవేళ ఇవన్నీ 50 శాతం ఎక్కువగా ఉంటే ఆ ఎక్కువ మొత్తాన్ని వేతనంలో కలుపుతారు. అలవెన్సులు మొత్తం వేతనంలో 50 శాతానికి మించకూడదు. ఉద్యోగులకు కమీషన్లు, పదవీ విరమణ, గ్రాట్యుటీ ప్రోత్సాహక వేతన లెక్కింపులోకి రావు. అయితే పదవీ విరమణ ,గ్రాట్యుటీ ప్రోత్సాహకం మినహా మిగతావన్నీ చెల్లించే వేతనంలో సగానికన్నా ఎక్కువగా ఉండకూడదు. ఒకవేళ ప్రోత్సాహకాలన్నీ 50శాతం కన్నా ఎక్కువగా ఉంటే వేతనంలో ఎక్కువ మొత్తాన్నే కలుపుతారు. ఈ విధంగా మొత్తం అలవెన్సులన్నీ 50 శాతానికి మించకూడదు.సామాజిక కోడ్ : కొన్ని కంపెనీలు ఉద్యోగులను మోసం చేస్తున్నారు. మూలవేతనం, డీఏ తక్కువగా చూపిస్తున్నారు. ఇతర అలవెన్సులు ఎక్కువగా ఇస్తున్నారు. ఆ ఉద్యోగులకు ఈపీఎఫ్ చందా చెల్లించడంతో వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దూరమవుతున్నాయి. సామాజిక భద్రత కోడ్‌లో 50% నిబంధన తీసుకువచ్చారు. ఈ నిబంధనలతో ఉద్యోగులకు తమ వేతనం నుంచి చెల్లించాల్సిన ఈపీఎఫ్ , యాజమాన్యం ఉద్యోగి ఖాతాలో జమచేసే చందా మొత్తం పెరుగుతాయి. దాంతో ఈపీఎఫ్ నిల్వలు పెరుగుతాయి. గతంలో సాధారణ ఉద్యోగులకు రూ.21 వేలు, దివ్యాంగులైన ఉద్యోగులకు రూ.25 వేల లోపు ఉంటేనే ఈఎస్ఐసీ సేవలు లభించేవి. ఇకనుంచి వేతన వివరణలో మూలవేతనం, రిటైనింగ్ అలవెన్సు, డీఏ మాత్రమే ఉంటాయి. తద్వారా ఈ మొత్తం రూ.21 వేలలోపు ఉన్న కార్మికులంతా ఈఎస్ఐసీలోకే వస్తారు.ఉదాహరణకు : ఒక ఉద్యోగికి నెలకు రూ.30 వేల వేతనం అందుతోంది. ఇందులో మూలవేతనం, డీఏ కలిపి రూ.12 వేలు వస్తుంది. ఇతర అలవెన్సులన్నీ కలిపి రూ.18 వేలు. గతంలోని నిబంధన ప్రకారం వేతనం రూ.30 వేలు దాటినందున ఆ ఉద్యోగికి ఈఎస్ఐ ప్రయోజనాలు వర్తించవు. ప్రస్తుతం కొత్త వేతన వివరణ ప్రకారం ఆ ఉద్యోగికి చెల్లించే అలవెన్సులు కలిపి మొత్తం వేతనంలో 50 శాతం కన్నా రూ.3 వేలు ఎక్కువ. దీంతో ఆ రూ.3 వేల అలవెన్సు వేతనంలో కలుపుతారు. అప్పుడు 12వేలు వేతనమైతే, 3 వేలు అలవెన్సు కలిపి రూ.15 వేలు అవుతుంది. రూ.21 వేల కన్నా తక్కువగా ఉన్నందున అతనికి ఈఎస్ఐ సదుపాయాలు అందుతాయి.

# విచారణలో నోరు విప్పిన ఐబొమ్మ రవి

**పైరసీ ఎలా చేశాడో చెప్పేశాడు!**

**శాటిలైట్ లింక్, క్యూబ్ నెట్‌వర్క్ హ్యాక్ చేసినట్లు వెల్లడి**

**హెచ్‌డీ హబ్ టెలిగ్రామ్ ఛానల్ ద్వారా పైరసీ లింకుల అమ్మకం**

**ఒక్కో లింక్‌కు 300 డాలర్ల వరకు వసూలు**

ఐబొమ్మ వెబ్ సైట్ నిర్వాహకుడు రవి కేసు విచారణలో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. పోలీసుల విచారణలో అతడు సినిమా పైరసీకి పాల్పడిన విధానాన్ని వెల్లడించాడు. టెలిగ్రామ్ ఛానల్ ద్వారా కొత్త సినిమాల పైరసీ ప్రింట్లతో వ్యాపారం చేసినట్లు ఒప్పుకున్నాడు.జరిగిన విచారణలో పైరసీకి సంబంధించిన కీలక వివరాలను రవి వెల్లడించాడు. కేవలం సాధారణ ప్రింట్లే కాకుండా, ఏకంగా క్యూబ్ నెట్‌వర్క్‌ను, శాటిలైట్




లింక్‌ను హ్యాక్ చేసి సినిమాలను హెచ్‌డీ ఫార్మాట్‌లో రికార్డు చేసినట్లు తెలిపాడు. ఈ విధంగా పైరసీ చేసిన సినిమాలను అమ్మేందుకు 'హెచ్‌డీ హబ్' పేరుతో ప్రత్యేకంగా ఒక టెలిగ్రామ్ ఛానల్ ఏర్పాటు చేసినట్లు చెప్పాడు. ఈ ఛానల్‌లో పైరసీ లింకులను అప్‌లోడ్ చేసి, ఒక్కో లింక్‌కు 100 నుంచి 300 డాలర్ల వరకు వసూలు చేసినట్లు స్పష్టం చేశాడు. ముఖ్యంగా 'హిట్-3', 'కిష్కిందపురి' సినిమాలను శాటిలైట్ లింక్ ద్వారానే పైరసీ చేసినట్లు అంగీకరించాడు.ఈ నేపథ్యంలో, మూడు వేర్వేరు కేసుల్లో విచారణ నిమిత్తం నాంపల్లి కోర్టు ఇమ్మడి రవికి 12 రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించింది. కోర్టు ఆదేశాల మేరకు సైబర్ క్రైమ్ పోలీసులు గురువారం చంచల్‌గూడ జైలు నుంచి అతడిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.

# రైతులకు గుడ్ న్యూస్ - యూరియా కష్టాలకు చెక్!

**యాప్ ద్వారా యూరియా బుకింగ్‌కు ఏర్పాట్లు**

**అన్నదాతలకు తీరనున్న యూరియా కష్టాలు**

**ఈ నెల 20 నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న ప్రభుత్వ యంత్రాంగం**



యూరియా కోసం ఎరువుల దుకాణాలు, సహకార సంఘాల చుట్టూ రైతన్నలు క్యూల్లో నిలబడి ఎదుర్కొంటున్న ఇబ్బందులకు రాష్ట్ర ప్రభుత్వం ముగింపు పలకాలని నిర్ణయించింది. ఈ నేపథ్యంలో రైతులు తమ ఇంటి నుంచే యూరియాను బుక్ చేసుకునేవిధంగా ఓ ప్రత్యేక మొబైల్ యాప్‌ను ఈ నెల 20వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నారు. ఈ విధానంతో యూరియా పంపిణీలో మరింత పారదర్శకత పెరగడంతో పాటు రైతులకు సమయం, శ్రమ రెండు ఆదా కానున్నాయని అధికారులు వివరిస్తున్నారు. యాప్ ద్వారా ఏవిధంగా యూరియా పంపిణీ చేస్తారు ఏవిధంగా రైతుల వివరాలు నమోదు చేస్తారు అనే వివరాలను ఇప్పుడు తెలుసుకుందాం.రాష్ట్రస్థాయిలో శిక్షణ : గత వానాకాలంలో రైతులకు యూరియా సరిపడా లభ్యం కాకపోవడంతో పలుచోట్ల ఆందోళనలు జరిగాయి. ఈ నేపథ్యంలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అక్రమాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు సరిపడా యూరియా లభించే విధంగా కొత్తగా బుకింగ్ విధానం తీసుకొచ్చింది. దీనిపై రాష్ట్రస్థాయిలో అధికారులకు శిక్షణ పూర్తికాగా, జిల్లాల వారీగా వ్యవసాయాధికారులతో డీలర్లకు యాప్‌పై అవగాహన కల్పిస్తారు. ప్రస్తుతం పత్తి పంటలను సాగు చేసిన అన్నదాతలు దాన్ని విక్రయించుకునేందుకు కపాస్ కిసాన్ యాప్‌లో స్లాట్ బుక్ చేసుకున్నట్లుగానే ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకొని యూరియాను ముందస్తుగా ఆ యాప్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. విడతల వారీగా : రైతులకు యూరియాను ఓకేసారి కాకుండా పలు విడతల వారీగా సరఫరా చేయనున్నారు. ఐదు ఎకరాల వరకు భూమి ఉన్న రైతులు రెండు విడతల్లో ఐదు నుంచి 20 ఎకరాల భూమి ఉన్న రైతన్నలకు మూడు విడతల్లో, 20 ఎకరాలకు మించిన భూమి ఉన్న రైతులు నాలుగు విడతల్లో యూరియాను బుక్ చేసుకొని తీసుకెళ్లాల్సి ఉంటుంది.నమోదు ఇలా : సంబంధిత యాప్‌లో రైతు పట్టాదార్ పాస్‌పుస్తకం నంబరును నమోదు చేయగానే లింక్ అయిన ఫోన్ నెంబర్‌కు ఓ ఓటీపీ(వన్ టైమ్ పాస్‌వర్డ్) వస్తోంది. ఆ ఓటీపీని నమోదు చేసిన వెంటనే రైతుకు చెందిన భూమి విస్తీర్ణం, సాగు చేసిన పంటకు అవసరమైనటువంటి యూరియా పరిమాణంలో బుకింగ్ ఆధారంగా అధీకృత రిటైలర్లు లేదా సహకార సంఘాల ద్వారా యూరియాను కొనుగోలు చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. బుకింగ్ చేసుకున్న యూరియా కేవలం 48 గంటలు(రెండు రోజులు) మాత్రమే ఉంటుంది. ఈ గడువు తేదీలోగా యూరియా తీసుకోనట్లయితే అది తిరిగి స్టాక్‌లోకి వెళ్తుంది.''రైతులకు అవసరమైన యూరియా అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సరికొత్త విధానాన్ని అమలు చేస్తోంది. ప్రతి ఒక్క రైతూ ఈ సరికొత్త విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మొబైల్ యాప్ ద్వారా యూరియా నిల్వలు, పంపిణీపై నిరంతర పర్యవేక్షణ అనేది సాధ్యమవుతుంది. యూరియా అక్రమ రవాణా(పక్కదారి పట్టడం), దారి మళ్లింపులకు సమర్థంగా అడ్డుకట్ట వేసేందుకు అవకాశం ఉంటుంది''. రైతుల సమయం ఆదా : ఈ యాప్ ద్వారా యూరియా పంపిణీ వల్ల రైతులకు సమయం ఆదాతో పాటు యూరియా, ఇతర ఎరువుల పంపిణీని సరళతరం చేసేందుకు ఈ విధానం తీసుకువచ్చినట్లుగా కొద్ది రోజుల క్రితం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వివరించారు. దీనిద్వారా ఎరువులు పక్కదారి పట్టకుండా, పంట పండించే అన్నదాతలకు మాత్రమే అందుతాయని చెప్పారు. యాప్ వినియోగంపై అన్నదాతలకు సమస్యలు ఉంటే సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారిని(ఏఈవో)ను సంప్రదించవచ్చని వివరించారు. అధికారులందరూ యాప్ గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆయన కోరారు.

# ఉన్నపళంగా ఉద్యోగాలు ఊస్ట్

**అమెరికాలో టీచర్ల కన్నీటి గాథ**

**చిన్నారుల్లో మానసిక ఆందోళన**

**ట్రంప్ వలస విధానాలతో అమెరికాలో టీచర్లకు కష్టాలు**

**పనిచేస్తున్న వారి వర్క్ పర్మిట్లను తిరస్కరిస్తున్న అధికారులు**

**టీచర్లు ఉన్నపళంగా దూరమవడంతో చిన్నారులపై తీవ్ర ప్రభావం**

**విదేశీ సిబ్బందిపై ఆధారపడ్డ పాఠశాలల యాజమాన్యాల ఆందోళన**



గత రెండేళ్లుగా సుసానా దినచర్య అంతా చిన్నారుల పాటలు, ఆటపాటలతోనే గడిచింది. కానీ, అక్టోబర్‌లో ఆమె జీవితం ఒక్కసారిగా తలకిందులైంది. ఆమె వర్క్ పర్మిట్ రెన్యువల్ దరఖాస్తును అమెరికా అధికారులు తిరస్కరించడంతో ప్రీ-స్కూల్ టీచర్‌గా తన ఉద్యోగాన్ని తక్షణమే వదులుకోవాల్సి వచ్చింది. ఇది కేవలం సుసానా కథ మాత్రమే కాదు, అమెరికాలో పనిచేస్తున్న వేలాది మంది వలస టీచర్ల ఆవేదనకు అద్దం పడుతోంది.దాదాపు పదేళ్ల క్రితం గ్వాటెమాలలో హింస నుంచి తప్పించుకుని అమెరికాలో ఆశ్రయం పొందిన సుసానా, తన గుర్తింపును గోప్యంగా ఉంచాలని కోరుతున్నారు. తన విద్యార్థులకు వీడ్కోలు చెప్పిన క్షణాలను ఆమె ఆవేదనతో గుర్తుచేసుకున్నారు. ''ఒక్క వారంలోనే నేను సర్వస్వం కోల్పోయాను. నేను వెళ్ళిపోతున్నానని చెప్పినప్పుడు, ఎందుకని అడిగిన పిల్లలకు సమాధానం చెప్పలేకపోయాను. కొందరు పిల్లలు నన్ను కౌగిలించుకున్నప్పుడు నా గుండె తరుక్కుపోయింది'' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.అమెరికాలో మొత్తం టీచర్లలో దాదాపు 10 శాతం మంది వలసదారులే ఉన్నారు. దేశవ్యాప్తంగా టీచర్ల కొరత తీవ్రంగా ఉండటంతో, ప్రభుత్వం విదేశాల నుంచి నిపుణులను ఆహ్వానిస్తోంది. 2023-24 విద్యా సంవత్సరంలోనే 6,716 మంది టీచర్లను తాత్కాలిక వీసాలపై అమెరికాకు రప్పించారు. అయితే, డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని ప్రభుత్వం వలసదారుల పట్ల కఠినంగా వ్యవహరిస్తుండటంతో, ఇప్పటికే చట్టబద్ధంగా పనిచేస్తున్న వారి ఉపాధి ప్రమాదంలో పడింది.సుసానా పనిచేసిన వాషింగ్టన్‌లోని 'కమ్యూనికిడ్స్' లాంగ్వేజ్ స్కూల్ దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. ఈ పాఠశాలలోని 90 శాతం సిబ్బంది వలస నేపథ్యం ఉన్నవారే. స్కూల్ సహ-వ్యవస్థాపకుడు రాల్ ఎచెవర్రియా మాట్లాడుతూ, ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల వల్ల తమ సిబ్బంది తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. వెనిజువెలాకు చెందిన ఐదుగురు టీచర్ల టెంపరరీ ప్రొటెక్టెడ్ స్టేటస్‌ను రద్దు చేయడంతో, 2026 అక్టోబర్ నాటికి వారి వర్క్ పర్మిట్లు ముగిసిపోనున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ పరిణామాలు కేవలం టీచర్ల జీవితాలనే కాకుండా, చిన్నారుల మానసిక ఆరోగ్యంపై, చదువుపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ''మా విద్యార్థులకు వారి టీచర్లతో బలమైన అనుబంధం ఉంటుంది. ఉన్నట్టుండి టీచర్లు దూరమవడం వారిని మానసికంగా కుంగదీస్తోంది'' అని ఎచెవర్రియా అన్నారు. విద్యా సంవత్సరం మధ్యలోనే టీచర్లు మారిపోతే పిల్లల భాషా నైపుణ్యాల అభివృద్ధి దెబ్బతింటుందని ఇటీవల ఒక అధ్యయనం కూడా తేల్చింది. ఈ భయానక వాతావరణం కారణంగా పాఠశాలల్లో అత్యవసర ప్రణాళికలను సిద్ధం చేసుకుంటున్నారు. అమెరికా పౌరుడైనప్పటికీ, తాను కూడా పాస్‌పోర్ట్‌ను వెంట తీసుకెళుతున్నానని ఎచెవర్రియా చెప్పడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com